# 'ప్రేమ'కి ముగింపు ఎప్పుడు?

[కథలూ- వ్యాసాలూ -ఇంటర్వ్యూలూ,
సమీక్షలూ, ఉత్తరాలూ, కలిసిన సంపుటం]



రంగనాయకమ్మ

# విషయ సూచిక

## ముందు మాట


1. ప్రేమకి ముగింపు ఎప్పుడు?..... (కథ) .............. 6
2. సుమ ప్రేమ కథ!...... (కథ) .............. 36
3. దేవుడు కూడా చచ్చిపోతాడా?... (కథ) .............. 45
4. సంస్కృతి: దాని రకాలూ, రూపాలూ ................ 47
5. "పప్పులో కాలేసింది" మార్క్సు కాదు,
అతని విమర్శకులే! .............. 74
6. వర్గాతీత మానవుణ్ణి చూపించండి! .................... 76
7. సత్యం వేపు మొహం తిప్పని దోపిడీ వర్గ వాదం! 78
8. 1917 అక్టోబరు విప్లవానికి సంబంధించి,
నేను రాసిన 4 వ్యాసాలు ............ 81
(1) కీర్తనలే గానీ, సమీక్షలేవీ?......................... 82
(2) మళ్ళీ అదే ప్రశ్న! జవాబేదీ! ........................ 84
(3) నా గురి, కమ్యూనిస్టు పార్టీల
ఫ్యూడల్, పెట్టుబడిదారీ ధోరణుల వైపు!..... 87
(4) ఆత్మస్తుతి ఆపండీ, పరనిందలు మానండి!. 92
9. వెనక్కి, తాతమ్మకన్నా వెనక్కి, పోతున్నాం! ......... 99
10. ఇవి గారడీ ప్రదర్శనలు!.................................. 100
11. 'మహిళా మార్గం' పత్రికకు ఉత్తరం.................. 101
12. వృద్ధుల కోసం ఆశ్రమాలు,
'మానవ సమాజం'లో కళంకాలు! ...................... 102
13. 'మహాశ్వేతాదేవి' గురించి కొంచెం ...................... 112
14. ఆ సినిమా ముగింపు ఇలా వుండి వుంటే?(సమీక్ష) 115

**15.** ‘తెలుగు అక్షర మాల’ గురించి చర్చించిన వారు 120
**16.** మంచి ప్రచురణ!............................................ 129
**17.** వ్యభిచార వ్యాపారాన్ని అడ్డుకోగలిగేవి,
ప్రజా సంఘాలే! ................ 129
**18.** ‘కుండ బద్దలు’ చానల్‌కి రాసినది! .................... 132
**19.** ‘ం’ని విడిగా పలక గలమా? .......................... 133
**20.** కులాంతర వివాహంపై దురహంకారం!............ 135
(1) విగ్రహాన్ని కూడా హత్య చేస్తారు!.................. 135
(2) అవమానపడ్డవారు నేర్చుకోవలిసింది,
ఆత్మగౌరవం! ........... 138
(3) ‘మార్క్సిస్టు శిబిరంలో ఉంటూ,
శత్రువుకు భరోసా’ ఇవ్వడం గురించి ............ 140
(4) కత్తి దెబ్బల్ని మించిన దెబ్బలు!.................... 147
**21.** కొన్ని ఇంటర్వ్యూలు ........................................ 151
(1) మార్క్సిజాన్ని ప్రేమించే మనిషిని
ద్వేషించేవాళ్ళు మార్క్సిస్టులా? ................ 151
(2) ‘రచన’ అంటే, ‘ఆత్మకథ’ కాదు!.................. 156
(3) 10 టీవీ ఇంటర్వ్యూ...................................... 159
(4) **V** 6 టీవీలో ఇంటర్వ్యూ ............................ 176
**22.** కీర్తి రంధితో మతి పోగొట్టుకున్న
సత్య హరిశ్చంద్రుడు! (సినిమా సమీక్ష) .................. 189
**23.** స్త్రీ-పురుష ‘సమానత్వం’ కోసం,
అత్యున్నత న్యాయస్థానం చూపిన దారి!............ 195
**24.** కావలిసింది,రామజన్మభూమి కాదు;
దున్నేవానికే భూమి! ............. 200

*

# 1. 'ప్రేమ'కి ముగింపు ఎప్పుడు?

ఎమ్‌టెక్ ఇంజనీరింగ్ ఫైనల్ పరీక్షలు జరగకముందే ఉద్యోగానికి సెలెక్టయిన గగన్ కుమార్‌కి, ఉద్యోగం మొదలై సంవత్సరం దాటక ముందే, ఆ ఇంజనీరు, అందులో నించి బైట పడాల్సి వచ్చింది. ఆ సందేహం, వారం రోజులకు ముందే ప్రారంభమై, ఆ వారం చివరికి తేలింది. గగన్ పని, విదేశీ ప్రోజెక్టులోనే. ఆ ప్రోజెక్టు ఎందుకో గానీ, యాడాదికే మూత పడింది. ప్రోజెక్టే మూతబడితే, దాని కోసం జరిగే పనులెలా నిలబడతాయి? గగన్‌తో పాటు, నిరుద్యోగులైన వాళ్ళు ఇంకో నలుగురు కూడా! ఎవరి దారిన వాళ్ళు పోయారు.

జరిగింది అర్ధమయ్యాక, పెద్ద జీతం రావాలనే ఆశ పెట్టుకోకుండా కొత్త ఉద్యోగం కోసం తిరిగితే, అది చప్పునే దొరికింది గానీ, అది కూడా ఆశ్చర్యంగా మొదటిదాని దారే పట్టింది! గగన్ కన్నా గొప్ప కొత్త మేధావి స్టూడెంటెవరో వస్తే, గగన్, మళ్ళీ బైటికి నడవవలిసి వచ్చింది! అసలు కారణం అది కాదని గగన్‌కి తర్వాత తెలిసింది. గగన్, లంచ్ టైమ్‌లో చదివే పుస్తకాలేవీ తోటి వాళ్ళల్లో ఇద్దరు ముగ్గురికి నచ్చలేదు. ఆ వార్త, మేనేజర్ దాకా పాకింది. గగన్ దాన్ని లక్ష్య పెట్టలేదు. ఉద్యోగం పోడానికి అదే కారణమో కాదో తెలియక ముందే గగన్ మళ్ళీ నిరుద్యోగి అయ్యాడు.

తర్వాత నెల తిరక్కుండానే మూడోది దొరకడం దొరికింది గానీ, అది పెద్ద కంపెనీ కాదు. ఆ ఆఫీసుకి వెళ్ళాలంటే, పాతిక మైళ్ళ దూరం! పైగా అది షిఫ్టుల వుద్యోగం కూడా కావచ్చు. గగన్‌కి, అది ఇష్టం లేకపోయినా, బ్రతుకుదెరువు ముఖ్యావసరం! తల్లిదండ్రులు, ధన రాసుల్లో మునిగి వున్నా, ఈ పుత్రుడికి వాళ్ళ ఆధారం శూన్యం! ఆ తల్లిదండ్రులిద్దరూ గవర్నమెంటు ఉద్యోగాలు చేసి, రిటైరై, విశ్రాంతులు పొందుతున్నవారు. డబ్బు తగువులతో వాళ్ళే కలిసి వుండడం లేదు, ఆ నాటి నించీ! ఇక, వాళ్ళు తనకి ఆధారం కాలేరని గగన్‌కి తెలుసు.

ఆ ఊళ్ళోనే, తల్లి వున్న రెండు గదుల అపార్టుమెంటుకి గానీ, తండ్రి వున్న మూడు గదుల ప్రైవేటు భవనానికి గానీ, ఏడాదిన్నర నించీ వెళ్ళని గగన్; అమ్మా నాన్నలతో ఆ నాటి నించీ ఫోనులో కూడా మాట్లాడని గగన్; ఆ పూట అయితే, తెల్లారి ఆరు దాటేటప్పటికే తండ్రి ముందు ప్రత్యక్షం అయ్యాడు!

తండ్రి విశ్రాంతి తీసుకుంటూ వున్న పరుపుల మంచానికి దూరంగా, ఆ మంచానికి పక్కనే వున్న సోఫానీ, కుర్చీల్నీ వదిలేసి, వాటి వెనక వున్న చెక్క స్టూలు మీద కూర్చున్నాడు.

తండ్రి, పరుపుల మంచం మీదే డైలీ పేపర్ తిరగేస్తున్నాడు. ఏడాది కిందట చూసినప్పుడు ముగ్గు బుట్టలా వున్న జుట్టు, నల్ల రంగుతో నిగ నిగ మెరిసిపోతోంది.

తండ్రికి నచ్చే 'డ్యాడీ' పలకరింపుని గగన్ పదేళ్ళ వయసులోనే వదిలేశాడు. అప్పుడు ఐదో తరగతిలో తెలుగు మేష్టారు, "అమ్మని 'అమ్మా' అనాలి. నాన్నని 'నాన్నా' అనాలి. 'నాయనా' అన్నా ముద్దుగానే వుంటుంది. అంతేగానీ, ఈ మమ్మీలూ-డ్యాడీలూ ఏమిటి? మతులు పోయి ఏడుస్తున్నారు" అన్నాడు నాలుగు సార్లు.

గగన్ ఇంటికొచ్చి "అమ్మా!" అంటే, అమ్మ ఖయ్యిమంది.

"మా మేష్టారు చెప్పారు" అన్నాడు.

రోజూ ఆ పిలుపుల మీద తగువులే. ఆఖరికి, విసుగెత్తారు మమ్మీ-డ్యాడీలు!

గగనే గెలిచాడు. ఈ నాటికీ తెలుగు పిలుపులే. "బాగున్నావా డ్యాడీ?" లేకుండా, గగన్ తను మాట్లాడదల్చింది సూటిగా ఎత్తాడు. "నాన్నా! నేను వచ్చే వారమే కొత్త ఉద్యోగంలో చేరాలి. అది చాలా దూరం! ఏదైనా సెకండ్ హ్యాండ్ స్కూటర్

వుంటేనే గానీ..."

"అంటే, రెండో ఉజ్యోగం కూడా ఊడగొట్టు కున్నావా? ఇప్పుడు మూడోదా? ఇదైనా నిలు స్తుందా? ఎన్నాళ్ళు?"

"నీ పని బాగుంటే, నిన్నెందుకు తీసేస్తారు?"

"కాదు, నా వర్క్ మీద ఒక్క కంప్లయింట్ కూడా లేదు. రెండు ఆఫీసుల్లోనూ లేదు."

"అయితే ఎందుకు తీసేశారంటావ్?"

"తెలీదు నాకు. వాళ్ళు తీసేసినా, నాకు వెంటనే ఇంకో ఉద్యోగం దొరికింది."

"అయితే ఏంటి? నీకు సైకిల్ ఉండాలిగా?"

"అది బాగా పాడైంది. ఇంజనీరింగ్ రోజుల్లో, ఆ కాలేజీ, దగ్గిరే కాబట్టి అప్పుడా సైకిల్ సరి పోయింది. ఇప్పుడు దానితో జరగదు. దాన్ని ఒక ఫ్యూన్‌కి ఇచ్చేశాను."

"ఒక్క పైసా దాచలేవు గానీ, దానాలు బాగా చేస్తావు. ఇప్పుడేంటి నువ్వనేది?"

"తర్డ్ హేండ్ స్కూటరైనా కావాలి."

"అయితే కొనూ! దానికేం? నాకు చెప్పడం ఎందుకు? రెండు ఉజ్యోగాలు చేశావ్‌గా? జీతాలు ఏమయ్యాయి? రాలేదా?"

గగన్ మౌనం!

"నీ జీతాల డబ్బేం చేశావ్?"

గగన్ ఇంకా మౌనం! తన తిండీ, తన బట్టలూ, చెప్పులూ, కొన్నాళ్ళు రూము రెంటూ, పాత సంవత్సరంలో అప్పులూ, పుస్తకాలూ - ఇవన్నీ చెప్పాలా, ఈ మూర్ఖుడికి? - అన్నట్టే ఇంకా మౌనమే వహించాడు. "....................."

"మీ మమ్మీని అడిగావా వెళ్ళి?"

"లేదు, ఇక్కడికే వచ్చాను."

"ఆ ధనవంతురాల్ని అడుక్కో! మొన్న అల్లుడికి లక్ష పంపిందని తెలిసింది. నిన్న గాక మొన్న, రెండేళ్ళ క్రితం, కూతురు పెళ్ళిలో పది లక్షలు పోశాం, తెలుసా? కిలో బంగారం కూడా ఇచ్చింది! పెళ్ళి ఖర్చులే నాలుగు లక్షలు దాటాయి. మళ్ళీ ఇప్పుడు అల్లుడికి లక్ష పంపు తుందా? అతగాడు గుర్రప్పందాల మీద తిరుగు తాడని కూడా తెలిశాకే ఆ లక్ష పంపింది! అడుగు అయ్యన్నీ! అల్లుడికి డబ్బు పంపడమే కాదు; ఐస్‌క్రీమ్‌లూ, మైసూర్‌పాక్‌లూ - అన్నీ! నాకు మైసూర్‌పాక్ చాలా ఇష్టం అని తెలుసు. నా కోసం పంపడం ఎప్పుడో మానేసింది."

"......................"

"ఏం? అడగలేవా? మొగుణ్ణీ, కొడుకునీ వదిలేసి, అల్లుడి భజన చేస్తోందా?"

సర్వెంట్ బోయ్ వంటింట్లోంచి, రెండు గిన్నెలూ, కాఫీ ఫ్లాస్కూ పెట్టిన పెద్ద ట్రేని మోసు కుంటూ తేబోతోంటే, గగన్ ఎగిరి లేచిపోయాడు. "వెళ్తాను" అనేసి, ఆ మాట కన్నా ముందే బైట పడ్డాడు.

తను బైట పడ్డ తర్వాత, తండ్రిగారి ఆధ్వ ర్యంలో, అక్కడ ఏం జరుగుతుందో, ఈ కొడుక్కి తెలుసు. గత అనుభవాలు లేవా? "ఏం తిన్నావు? ఇప్పుడు ఎక్కడ ఉంటున్నావు?" అని తండ్రి అడగకపోవడం, ఇవ్వాళ కొత్తా? - అదంతా పాత చరిత్రే!

"ఫ్రెండ్ దగ్గిర వుంటున్నాను" అని ఏడాది కిందట అన్నప్పుడు, "అయితే, నీ పెళ్ళీ, నీ అంత్యక్రియలూ అన్నీ, ఆ ఫ్రెండే చేస్తాడులే" అన్నవాడే కదా ఈ తండ్రి?

కొడుకు బైటికి పరిగెత్తగానే, మంచం మీద విశ్రాంతి తీసుకుంటూ వున్న పెద్ద మనిషి, లేచి, ఆ పక్కనే వున్న సోఫాలో కూర్చుంటోంటే, సర్వెంట్ బోయ్, చిన్న బల్లని అక్కడికి జరిపి, ఆ ట్రేని బల్ల మీద పెట్టి, పరుగున పోయి, మంచి నీళ్ళ గాజు లోటా కూడా తెచ్చి నెమ్మదిగా పెట్టాడు.

"అరేయ్! గదిలో ఎవరున్నారో, ఎవరితో మాట్లాడుతున్నానో, చూసుకోకుండా, ట్రే పట్టు కొచ్చేస్తావా? ఎన్ని సార్లు చెప్పాను నీకు?"

"సార్! మన అబ్బాయిగారే కదా అని...."

"అయితే మాత్రం? అబ్బాయి ఎలాంటి వాడో తెలీదా నీకు? రెండేళ్ళ నించీ వున్నావు. వాడు ఏ హోటల్లోనో సుష్టుగా మింగే వచ్చి వుంటాడు. నా కోసం ఏ పూరీ పేకెట్టయినా తెచ్చాడా? నువ్వయితే,

# 2. సుమ ప్రేమ కథ!

**సుమతి** స్నేహితురాలి కుటుంబంలో, తిండి విషయంలో, ఆకు కూరలూ, కూర గాయలూ, పప్పులూ ఉప్పులూ తప్ప, ఇంకేమీ ముట్టరు. తనైతే, చిన్న తనం నించీ, ఆ స్నేహితురాలికి వ్యతిరేకమైన తిండి అలవాట్లతోనే పెరిగింది. కొంత ఆలోచన పెరిగిన తర్వాత 'మాంసాలు' వదిలేసి, 'చేపల' దగ్గిర ఆగిపోయింది! అది కూడా తప్పని తెలుసు. ఆ తప్పు, అప్పుడప్పుడూ జరుగుతూనే వుంది. భర్త అయితే, పూర్తిగా "జీవ హింస చేయరాదు" సూత్రంతో, అన్నీ వదిలేశాడు. సుమతికి, తను ఇష్టపడి చేసుకున్న భర్త మాట అంటే లక్ష్యమే గానీ, అంత కన్నా చేపల కూరే లక్ష్యం.

"నేను నీ దగ్గిరికి రాను" అని అతను బెదిరించాడు గానీ, "అయితే, నేనే నీ దగ్గిరికి వస్తా" అని సుమతి కూడా బెదిరించింది. ఒక సారి అంది, "పిల్లల్ని రానియ్యి ఇంట్లోకి. ఈ చెత్త వాళ్ళకి తినిపిస్తానా?" అంది.

అది జరగలేదు. పిల్లలు ప్రవేశించలేదు. సుమతి దిగులు పడ్డప్పుడల్లా అతను ఓదార్చాడు. స్వంత పిల్లలు మరుపై పోయినందుకే, స్నేహితురాలైన అనసూయ కూతురే సుమతి కుటుంబానికి కూడా కూతురైపోయింది. స్నేహితురాళ్ళ కుటుంబాల్లో రాక పోకలు ఎప్పుడూ జరిగేవే. మొగ వాళ్ళ ఉద్యోగాలు ఎటు మారినా, వాళ్ళ రాకపోకలు ఎప్పటిలాగే!

రెండు కుటుంబాలకీ ఒకే కూతురైన కుసుమ, ముద్దు పేరుతో 'సుమ'గా మారింది. సుమ, తన 'కుసుమ' పేరు తనే మర్చిపోయింది. "కుసుమా!" అంటే, ఎవరినో పిలిచారు అనుకుంటుంది.

సుమకి, సుమతి పెద్దమ్మ ఇంటికి పరుగు పరుగున రావడం ఆనందమే గానీ, వచ్చీ రాగానే కోపంగా "ఏం కూరా?" అంటుంది.

"ఛ! నువ్వు వస్తావని తెలిసినా, ఆ కూర ఎలా వండుతానే?" అంటుంది సుమతి.

"ఏమో! నిన్నెవరు నమ్మారు? పెద్ద నాన్న ఎంత మంచివాడు! నీకు మంచి తనం లేదా? నీ పేరు సుమతి. మంచి 'మతి'! నీకు 'దుర్మతి' అని పేరు పెట్టవలిసింది" అని మొదలుపెడుతుంది సుమ.

"మా అమ్మ అలా పెట్టలేదులే, నువ్వు పెట్టు! నేను దుర్మతినే. మీ అమ్మ సాధిస్తూనే వుంటుంది. ఇక నువ్వు పట్టుకున్నావు."

"పెద్దమ్మా! చేపలు నీళ్ళల్లో చక్కగా ఆడుకుంటాయి. వాటి మీద నీకు దయ లేదా, జాలి వుండదా?" అంటుంది సుమ.

"అవును, నాది తప్పే, తప్పే" అని ఒప్పేసుకుంటుంది సుమతి. "తప్పు చేస్తూ, ఆ - తప్పుని ఒప్పుకోకపోతే, అది మరీ పెద్ద తప్పు కదా?" అంటుంది.

సుమతి స్నేహితురాలైతే, "'తప్పే' అంటావు. 'తప్పు' అని తెలిసి, తప్పెందుకు చేస్తావు?" అంటుంది. ప్రతీ సారి, "మానేస్తా" అంటుంది సుమతి. కానీ, ఆర్నెల్లకి ఒక్క సారైనా ఆ మాట తప్పు తుంది. ఈ స్నేహితురాలు, విసుగెత్తి ఎప్పుడో వదిలేసింది ఆ స్నేహితురాలు. ఇక ఆ వాదం అంతా సుమదే! పుస్తకాల కబుర్ల వరకే సంబంధం పెట్టుకుంది పెద్దమ్మతో.

సుమ అమ్మా, పెద్దమ్మా, ఆ ఇద్దరూ చక్కగా కాలేజీ చదువులు పూర్తి చేసుకుని, ఉద్యోగాల్లోకి కూడా పోయారు వేరే వేరే ఊళ్ళల్లో. తల్లిలాగే సుమకి కూడా పుస్తకాల అలవాటు బాగా పట్టింది. వాళ్ళ ఇంట్లో వెనకటి రచయితల పుస్తకాలు చాలా వుంటాయి. ఎవరడిగితే వాళ్ళకి, ఏది అడిగితే అది ఇచ్చి వాటిని వెనక్కి తీసుకోక, అన్ని పుస్తకాలూ అవగొట్టుకున్నారు. కొనడానికైతే మళ్ళీ కొంటూనే వుంటారు.

అమ్మకీ, పెద్దమ్మకీ పెళ్ళి చూపుల పెళ్ళిళ్ళే జరిగాయని సుమకి పెద్దయ్యాక తెలుసు. కానీ, సుమ తన కోసం ఆ రకం వాటికి వ్యతిరేకం.

సుమకి పాతికేళ్ళు దాటుతోన్నా పెళ్ళి ప్రసక్తి లేదు. తనని ప్రేమలో ముంచెత్తిన అబ్బాయి దొరక లేదంటుంది. ఆ మాటలు సరదాకే

అంటుంది గానీ, "పుస్తకాలు చదివే అబ్బాయిలు కనపడడం లేదు నాకు" అంటుంది నిరుత్సాహంగా.

"సినిమా పత్రికలు తిరగేస్తే, అదేనా సాహిత్యం? సిగరెట్లు కాల్చకపోతే, అదేనా సంస్కారం? అటువంటి మనిషితో జీవితం ఎలా గడుస్తుంది?" అంటుంది.

"పుస్తకాల వాళ్ళే లేరంటావా? అలాగైతే, బుక్ షాపుల్లో పుస్తకాలు కొనే వాళ్ళందరూ ఎవరు? పుస్తకాలు కొన్నవాళ్ళు వాటిని తెరవరా? చద వరా?" అంటే, వెంటనే తన తప్పు సర్దుకుం టుంది.

"అలా అన్నానా? అయితే తప్పే. మొన్న ఎగ్జిబిషన్‌లో పుస్తకాలు కొంటూ ఎందరో కన పడ్డారు. వాళ్ళు లేరని కాదు. అలా అయితే ఎగ్జి బిషన్లెలా జరుగుతున్నాయి? అది కాదు నేననేది. నాకు..... ఆసక్తి కలగడం లేదనేదే. అంతే నేననేది."

"సరేలే. ఆసక్తే లేకపోతే, కలిసి బ్రతకడం ఎలాగ?"

"అదే నేననేది. కావాలనుకునే రకం మనిషి కనపడకపోతే ఏం చేస్తాం? అంతే!" అంటుంది.

సుమతి నవ్వి, "అలా జరగదు. నువ్వు వున్నావుగా? అతనూ వుంటాడు. నీ కోసం అతను కూడా ఎదురు చూస్తున్నాడేమో! నువ్వే అతనికి కనపడాలి" అంటుంది.

సుమ నవ్వుతుంది. "అది జరగదు" అంటుంది.

అలాంటి సుమకి, 'అతడు కనపడడమే' కాదు; తను, 'తల మునకలుగా' ప్రేమలో పడిపోయింది! ఆ మాట తను చెప్పిందని కాదు; అలా అయి వుంటుందని స్నేహితురాళ్ళిద్దరూ ఊహించారు. అయినా, సుమని అడగలేదు, సుమ చెప్పలేదు. కూతురు ఇష్టానికి దాన్ని ఎప్పుడో వదిలేశారు తల్లీ, తండ్రీ.

కుసుమ పనిచేసే ఆఫీసులోకి కొత్తగా చేరిన అబ్బాయి, ఈమె సెక్షన్‌లో తోటి ఉద్యోగి. అతనికి పుస్తకాల శ్రద్ధ చాలా ఎక్కువ. ఈశాన్య రాష్ట్రాల్లో ఏదో ప్రాంతం. అటు ఏదో ప్రాంతం వాడు. మావో పుస్తకాల గురించి ఎక్కువగా చెపుతాడు. కుసుమకి తెలియని విషయాలు వుంటాయి అందులో. అతని రూపు రేఖలూ, గుణ గణాలూ, ఆఫీసు పనుల్లో అతని తెలివి తేటలూ, ఈమెని ఆశ్చర్య పరుస్తాయి. అతను పెళ్ళి కాని వాడని ఈమెకి చాలా వారాల తర్వాత గానీ తెలియలేదు. నిర్భ్రాంతపోతూ అతన్ని కొత్తగా చూడడం మొదలు పెట్టింది. అతనికి ఇంకా 'పెళ్ళి' జరగక పోవచ్చు గానీ, అతని మనసులో ఎవరైనా వున్నారేమో - అనే సందేహంతో కొన్ని నెలలు నిదానించింది.

ఆ సందేహాల్లో కూడా అతన్ని గురించి కలలు కనడం ఆగలేదు. అతను, తనతో ఎక్కువ ఆసక్తిగా మాట్లాడడానికి ప్రయత్నిస్తున్నాడని కూడా గ్రహించింది. - అవన్నీ పెద్ద వాళ్ళకి తర్వాత తెలిసిన విషయాలే.

అతన్ని గురించి "అతను, సిగరెట్లు కూడా కాల్చడు" అంటూ సుమ ఆఫీసులో తోటి వుద్యోగి గురించి చెప్పినట్టే చెప్పేదిగానీ, తన ఆసక్తిని ఏ మాత్రం తెలియనిచ్చేది కాదు.

అతన్ని పొగుడుతూ తల్లికి చెప్పినా, పెద్దమ్మకి చెప్పినా, స్నేహితురాలికి చెప్పినా, "అబ్బా! అంత మంచివాడా? అంత తెలివైనవాడా?" అనడమే గానీ, అంతకన్నా అడిగే వాళ్ళు కాదు వాళ్ళు. ఆ సందేహమే రాలేదు వాళ్ళకి చాలా రోజులు.

సుమ తల్లి, తన స్నేహితురాలిని అడిగేది ఒక్కోసారి, "సుమ నీతో ఏమైనా చెప్పిందా?" అనేది.

"లేదే! నువ్వే నాకు చెపుతావులే అనుకుం టాను. నీకేమీ చెప్పలేదా? పోనియ్యి అది చెప్పినప్పుడే విందాం" అనేది ఈ స్నేహితురాలు.

సుమ గురించి ఏదైనా సరదా కబురు వింటాం - అనే గానీ, "పిల్లకి పెళ్ళవడం లేదే!" అని విచారం కాదు, తల్లీ వాళ్ళకి. ఏ తాగుబోతు వాడిని నమ్ముతుందో - అని కొంచెం భయం మాత్రం వుండేది వాళ్ళకి. అది ఇష్ట పడితే, అతను ఏ కులం అయినా, ఏ మతం అయినా, అడ్డు పడే మనుషులు కారు వాళ్ళు.

ఒక్కోసారి సుమ, ఆఫీసులో అబ్బాయిని గురించి నవ్వుతూ, పెద్దమ్మతో, "చాంద్ ఇవ్వాళ మొగలి సెంట్ పరిమళం వచ్చాడు" అనో, "మల్లె వాసన వచ్చాడు" అనో, చెపుతుంది. అతన్ని తను అడిగిందట ఒకసారి, "ఏంటీ, మీరు సెంట్లు వాడతారా?" అంటే, అతను కొంచెం నవ్వి,

# 4. సంస్కృతి
## దాని రకాలూ, రూపాలూ

"సంస్కృతి" అనే మాటని చిన్నప్పుడు స్కూలు పుస్తకాల్లో చదివామో లేదో గుర్తు లేదు. ఎక్కడో అక్కడ చదివి వుండమా? - చదివే వుంటాం. చదివినా, దాని అర్థం ఏమిటో ఆ నాడు తెలిసి వుండదు. ఆ అర్థం తెలియకే నేమో అది చదివినట్టు గుర్తులేక పోవడం కావచ్చు!

ఇంటా, బైటా, మాట్లాడుకునే మాటల్లో, "సంస్కృతి" అని, అమ్మలూ, అత్తమ్మలూ, అమ్మమ్మలూ, నాయనమ్మలూ, నాన్నలూ, తాతలూ, పోనీ ఇంకెవరైనా, మాట్లాడారా? ఇంట్లో, ఆ మాట ఎవరన్నా పలకడం విన్నామా? - అలా జరిగినట్టు లేదు. అంతంత మాటలు మాట్లాడే పండితులు మా ఇంట్లోనే కాదు, మా ఊళ్ళోనే లేరు.

పోనీ, చిన్నప్పుడు చదివిన ఏదైనా కథ లోనో, నవల లోనో అయినా, ఆ మాట వచ్చి వుండదా? - వచ్చే వుంటుంది! అదీ గుర్తు లేదు. ఆ మాట ఎక్కడన్నా, విన్నా - చదివినా, దాని అర్థం ఏమిటో, ఆ నాడు తెలియకే నేమో ఈ మతి మరుపులన్నీ! అంతే కావచ్చు.

"సంస్కృతి" అంటే, ఇప్పటికి తోచే అర్థం, అది ఒక "ఆచారం" అన్నట్టు అనిపిస్తుంది. "ఆచారం" అంటే, అది, 'సమాజంలో ఒక నిబంధన' అవుతుంది. అందరూ, ఆ నిబంధన ప్రకారం నడవాలనీ, అలా నడవడం మంచిదనీ, చెప్పడమే కదా, 'ఆచారం' అంటే?

"సంస్కృతి" అనే మాట వల్ల, అది ఏమిటో అర్థం కాదు గానీ, "ఆచారం" అనే మాట వల్ల, అది తేలిగ్గానే అర్థం అవుతుంది. మనం రోజూ మాట్లాడుకునే మాటల్లో "ఆచారాలు, ఆచారాలు" అంటూనే వుంటాం. అర్థం కాని మాటగా "సంస్కృతి" అనడం కన్నా, "ఆచారం" అనడమే తేలికగా వుంటుంది కదా?

"సంస్కృతి" అనే మాటకి సంస్కృత భాషలో అర్థం ఏమై వుండవచ్చో కొంచెం చూస్తే? "సంస్కరణ జరిగిన విషయం" అని అర్థం వస్తుంది.

ఒక నాడు అమలులో వున్న ఒక ఆచారానికి, "సంస్కరణ" జరగక ముందు, ఆ ఆచారం, ఎటువంటిదై వుంటుంది? - అది, ఆ నాడు 'కొంత తప్పు ఆచారమా?' 'సంస్కరణ' జరిగిన తర్వాత ఏర్పడ్డ ఆచారం, ఎటువంటిది? - అది, 'కొంత మంచి ఆచారం' అవుతుందా? - ఈ రకంగా, గతంలో వున్న ఒక 'చెడ్డ'లో కొంత మార్పు జరిగి, అది కొంత 'మంచి'గా మారక పోతే, 'సంస్కరణ జరగడం' అనే దానికి అర్థం ఏమిటి? - కాబట్టి, 'సంస్కరణ'కి అర్థం, 'చెడ్డలో ఎంతో కొంతని తగ్గించే చర్యే' అవుతుంది కదా?

"సంస్కృతి"కి, సమానమైన ఇంగ్లీషు మాట "కల్చర్" అని వుంటుంది. ఈ "కల్చర్" అనే మాట, "అగ్రికల్చర్" అనే పాత ఇంగ్లీషు మాట నించి పుట్టినట్టుగా నిఘంటువులు చెపుతున్నాయి.

"అగ్రికల్చర్" అంటే? - భూమి, పుట్టింది పుట్టినట్టు, ఎత్తు పల్లాలతో వుంటే, దాన్ని సంస్కరించడం - అని! ఎగుడు దిగుళ్ళ భూమిని చదునుగా సరిచెయ్యడం - అని! ఆ సరిచేయడాలెందుకు? ఆ భూమిలో గుడిసెలు వేసుకోవాలంటే, లేదా నాలుగు మొక్కలు పాతుకోవాలంటే, ఎత్తు పల్లాల భూమి మీద ఎంతో కొంత సవరణ జరగకపోతే ఎలాగ? భూమిని సవరించడమే 'అగ్రికల్చర్'! ఈ 'అగ్రికల్చర్'లో నించే 'కల్చర్' (సంస్కృతి) వచ్చిందని నిఘంటువులు అంటున్నాయి.

ఎగుడు దిగుళ్ళ, ఎత్తు పల్లాల భూమి మీద కొంత సంస్కరణ జరిగితేనే, ఆ భూమి వ్యవసాయానికి గానీ, మరొక అవసరానికి గానీ, పనికి వస్తుంది. అలాగే, ఒక అస్తవ్యస్తపు 'పాత ఆచారం'లో కొంత సంస్కరణ జరిగితే, ఆ అస్తవ్యస్తత కొంత తగ్గి, అది 'కొత్త ఆచారం'

అవుతుంది. ఈ రకంగానే ఆచారాలు (సంస్కృతులు) మారుతూ వుంటాయి - అనుకోవచ్చు. 'చెడ్డ' నించి, 'మంచి' వేపు దారి తీసేదే, సంస్కరణ!

అయితే, ఒక పాత ఆచారంలో వున్న అస్త వ్యస్తత మీద కొంత సంస్కరణ జరిగి, అది కొంత 'కొత్త ఆచారం'గా మారితే, ఆ కొత్తది, పాత దాని కన్నా 'కొంత నయమైనది'గా అవుతుందని అర్థమే గానీ, దానితోనే అస్తవ్యస్తత అంతా పూర్తిగా పోతుందని అర్థం కాదు.

"సంస్కరణ" అనేది, ఒక "చెడ్డ"ని 'మంచి' వేపు 'కొంత మార్పు' చేయగలదే గానీ, 'చెడ్డ' నంతా పూర్తిగా నిర్మూలించలేదు. ఆ నిర్మూలన పూర్తిగా జరగాలంటే, ఆ 'సంస్కరణ'కి, ఆ 'చెడ్డ' ఏమిటో, అది ఏ కారణంతో ఏర్పడిందో, ఆ చెడ్డని పూర్తిగా తీసివెయ్యడం ఎలాగో, అవన్నీ పూర్తిగా తెలిసి వుండాలి. కానీ, "సంస్కరణ" అనేది, అంత వివేకంగా జరిగేది కాదు. అది, కేవలం, కొన్ని కొన్ని సవరింపులు చేసేదిగా మాత్రమే వుంటుంది. 'చెడ్డ' మీద, ఆ సవరింపులు అవసరమే. అయినా, సవరింపులతోనే చెడ్డ పూర్తిగా మారదు కాబట్టి, కొత్త ఆచారం, పాత ఆచారాన్నే పోలి వుండి పోతుంది!

## సంస్కర్తలు:

అమలులో వున్న ఆచారంలో జరుగుతూ వున్న 'చెడ్డ'ని చూసి ఆగ్రహ పడుతూ, ఆ చెడ్డలో ఎంతో కొంత మార్పు చేయాలని భావించేవారు, సంస్కర్తలే. 'చెడ్డ'ని, వారు, ఏ రకంగా, ఎంత వరకూ అర్థం చేసుకుంటారో అంత వరకూ దాన్ని వ్యతిరేకిస్తారు. ఆ వ్యతిరేకత జరగాలని ప్రచారం చేస్తారు. దాని కోసం నడుం కడతారు. అది, ఎంత చిన్న సవరింపు అయినా, ఆ సవరింపు జరగ రాదని భావించే జనాభాయే అధిక సంఖ్యలో వుంటారు. దాని వల్ల, ఏ సంస్కర్త అయినా, కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటూనే కొత్త మార్పుని సాధించవలసి వుంటుంది.

'చెడ్డ' మీద నిజమైన ఆగ్రహంతో పని చేసే సంస్కర్తలు, నిజాయితీపరులే. కానీ, కేవలం 'కీర్తి' కోసం, 'ప్రతిష్ట' కోసం, 'చెడ్డ' మీద మాటలే గానీ, చేతలు లేని వారు, నిజాయితీ పరులుగా లెక్కకు రాలేరు. జనంలో అధిక సంఖ్య, 'చెడ్డ'కి వ్యతి రేకులైనప్పుడు, నిజాయితీ హీనులైన సంస్కర్తలు, బట్టబయలవుతూ వుంటారు.

'చెడ్డ'లో మార్పు అనేది, సంస్కరణల ద్వారానే ప్రారంభమై జరుగుతూ వుంటుంది. కానీ, 'సంస్కరణ' వల్ల, కొత్త ఆచారం, పాత ఆచారం నించి పూర్తి భిన్నంగా ఏర్పడడం మాత్రం జరగదు.

సంస్కరణల్లో కొన్ని, చిన్న చిన్న సవరింపులు చేస్తే; కొన్ని సంస్కరణలు, పెద్ద సవరింపులు కూడా చేస్తాయి. అయినా, ఎంత పెద్ద సవరింపు కూడా, చెడ్డని పూర్తిగా నిర్మూలించజాలదు. అయినా, 'సవరింపు' అనేది, ఎంత చిన్నదిగా అయినా జరగకపోతే, అసలు 'చెడ్డ'ని కదిలించ డమే ప్రారంభం కాదు.

పాత ఆచారం, ఒక నాటి 'పాత సంస్కృతి'! కొత్త ఆచారం, కొంత మార్పు గల 'కొత్త సంస్కృతి!'

అయితే, ఏ కొత్త సంస్కృతిని అయినా, అది ఎంత సరియైనదో నిర్ణయించడం ఆ నాడే సాధ్యం కాదు. అది, పాత దాని కన్నా కొంత మెరుగైనదిగా మాత్రం ఆ నాటికి అవుతుంది. ఒక ఆశ్చర్యం ఏమిటంటే, కొన్ని కొత్త సంస్కృతులు, పాత సంస్కృతుల కన్నా కూడా తప్పుడువిగా, అంటే మరింత అస్తవ్యస్త మైనవిగా, అవుతూ వుంటాయి! అలా అవడానికి, దేని కారణాలు దానికి వుంటాయి.

అందుకే, ఒక ఫలానా సంస్కృతిని తీసుకుని, అది సరైనదో కాదో, అది ఎందుకు అలా ఏర్ప డిందో, తెలియాలంటే, అసలు, "మానవ సమాజం" అంటే ఏమిటో, "మానవ సంబం ధాలు" ఎలా సాగుతున్నాయో, ఆ సంబంధాల్లో, సంస్కృతుల (ఆచారాల) పాత్ర ఏమిటో - ఇటువంటి విషయాలు మొదట తెలియాలి.

"సంస్కృతి" అంటే, ఒక "ఆచారం" అనో, ఒక "జీవిత విధానం" అనో, అర్థాలు చెప్పకో వచ్చు. ఎలా చెప్పుకున్నా, ఇప్పటికీ, "సంస్కృతి"

# 8. 1917 అక్టోబరు విప్లవానికి సంబంధించి నేను రాసిన 4 వ్యాసాలు

1916 నవంబర్ దాటగానే, ఇక 1917 అక్టోబర్ విప్లవానికి వందేళ్ళు నిండబోతున్నాయనీ; అది శత వార్షికోత్సవ సందర్భం అనీ: కమ్యూనిస్టు పత్రికలు మొదలెట్టాయి. అంత గొప్ప విప్లవాన్ని కీర్తిస్తూ రాసిన వ్యాసాల్లో, అది తర్వాత కాలంలో కనుమరుగు కావడానికి కారణాల పరిశీలన లేదు. ఆ కారణాలను పరిశీలించిన పుస్తకాల కోసం చూడగా, ఫ్రాన్స్ దేశపు మార్క్సిస్టు ఆర్థిక శాస్త్ర వేత్త చార్లెస్ బెతల్ హమ్, సోవియట్ రష్యాలో 1917 నించీ 1941 వరకూ జరిగిన వర్గ పోరాటాల గురించి రాసిన 4 సంపుటాలు నాకు గుర్తుకు వచ్చాయి. ఒరిజినల్ గా ఫ్రెంచ్ భాషలో రాసిన వాటికి ఇంగ్లీష్ అనువాదాలు ఉన్నాయి. వాటిని చదివాకా, సోవియెట్ రష్యాలో ఏం జరిగిందో అర్థమైంది. ఆ సంపుటాలను సంక్షిప్తంగా పరిచయం చేయాలనిపించి, 2017 జనవరి నించీ 2017 జులై వరకూ ఆ పనిలో ఉండి, 2017 ఆగస్టులో, మా 'స్వీట్ హోమ్ పబ్లికేషన్స్' తరపున, పరిచయం పుస్తకం తెచ్చాము. దాని పేరు : " 1917 అక్టోబర్ విప్లవం ఎందుకు పోయింది? సోవియట్ రష్యాలో ఏం జరిగింది?" ఈ పుస్తకానికి నేను రాసిన ముందుమాట లోంచీ కొన్ని భాగాలు, "కీర్తనలేగానీ, సమీక్షలేవీ?" అనే పేరుతో ఒక వ్యాసం 2-9-17న ఆంధ్ర జ్యోతిలో వచ్చింది. 2017 నవంబరు నెలలో, తెలుగు రాష్ట్రాలలో అక్టోబర్ విప్లవం శత వార్షిక సభల్ని కమ్యూనిస్ట్ పార్టీలు జరిపాయి. వాటి రిపోర్టులు ఆ పార్టీల పత్రికల్లో వచ్చాయి. ఆ రిపోర్టుల్లో కూడా, 1917 అక్టోబర్ విప్లవం కనుమరుగవడానికి గల కారణాల వివరణే లేదు. అప్పుడు నేను "మళ్ళీ అదే ప్రశ్న, జవాబు లేదేం?" అనే పేరుతో, ఆంధ్రజ్యోతి లో, 30-12-17న ఒక వ్యాసం రాశాను. అది వచ్చిన మర్నాడే, సిపిఎం కేంద్ర కమిటీ కార్యదర్శి వర్గ సభ్యుడు వి.శ్రీనివాస రావు గారు 'ఆంధ్రజ్యోతి' లో గాక, తమ పార్టీ పత్రిక 'ప్రజా శక్తి'లో 31-12-17న ఒక వ్యాసం రాశారు. దాని పేరు: "రంగనాయకమ్మ గారూ, మీ గురి ఎటు వైపు?" నిజానికి, జర్నలిజపు పద్ధతి ప్రకారం, ఒక పత్రికలో ఒక వ్యాసం వస్తే, ఆ వ్యాసం మీద రాసేవారు, తమ వ్యాసాన్ని అదే పత్రిక్కి పంపాలి. ఆ పత్రిక వేయకపోతే, వేరే పత్రికలో ప్రచురణకి పంపుకోవాలి. కానీ, ఆయన అలా చెయ్య లేదు. ఆ వ్యాసంలో ఆయన, 'మిత భావాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన సమయంలో' నేను కమ్యూనిస్టుల మీద దాడి చేశానని ఆరోపించారు. అప్పుడు ఆయన వ్యాసానికి జవాబుగా నేను, "నా గురి కమ్యూనిస్ట్ పార్టీల ఫ్యూడల్-పెట్టుబడిదారీ ధోరణుల వైపు" అని ఒక వ్యాసం 'ప్రజా శక్తి లో 5-1-18న రాశాను. ఈ వ్యాసానికి జవాబుగా శ్రీనివాస రావు గారు, నన్ను కొన్ని ప్రశ్నలు అడుగుతూ, విమర్శలతో ఇంకో వ్యాసం, 'ప్రజా శక్తి' లోనే 9-1-18 న రాశారు. దాని పేరు: "రంగనాయకమ్మ గారూ ! మీ బాణం గురి తప్పింది, దిశ మార్చండి!"

అని. ఈ వ్యాసంలో ఆయన అడిగిన ప్రశ్నలకు జవాబులు ఇవ్వాల్సిన బాధ్యత నాకు ఉంది కాబట్టి, నేను తిరిగి ఒక వ్యాసం రాశాను - "ఆత్మస్తుతి ఆపండీ, పర నిందలు మానండి!" అని. కానీ, దీనిని 'ప్రజాశక్తి వారు "వాదనలను కొనసాగించదలుచుకోలేదు" అని నాకు రాసి, నా వ్యాసాన్ని ప్రచురించడానికి నిరాకరించారు. ఆ వ్యాసాన్ని తర్వాత నాకు తెలిసిన పాఠకులకూ, ఫేసుబుక్కులకూ, గ్రూపులకూ, వెబ్ సైట్స్ కీ పంపాను. ఆ నాలుగు వ్యాసాల్నీ ఇక్కడ వరసగా ఇస్తున్నాను.

# 1. కీర్తనలే గానీ, సమీక్షలేవీ?

రష్యాలో, శ్రామిక వర్గ విప్లవ ప్రారంభం, 100 సంవత్సరాల కిందట 1917లో జరిగింది. ఆ విప్లవానికి నాయకత్వం వహించిన శ్రామిక పార్టీ, ఆ విప్లవం కన్నా ముందే ఏర్పడి వుంది. ఆ విప్లవాన్ని, **"రష్యన్ అక్టోబరు విప్లవం"** అంటారు. తర్వాత, ఆ పార్టీయే పేర్లు మార్చుకుంటూ 1952 లో, "సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ"గా అయింది.

కానీ, ఆ కమ్యూనిస్టు పార్టీ, 1991 ఆగస్టు 29న రద్దయి పోయింది! రద్దు తర్వాత, ఆ పార్టీని నిషేధించడం కూడా జరిగింది!

రష్యా విప్లవ ప్రారంభం 1917లో జరిగితే, దానికి ఈ నాటి 2017తో 100 యేళ్ళు నిండినాయని భారత కమ్యూనిస్టు పార్టీలు లెక్కలు బాగా కట్టాయి. 'వంద యేళ్ళ' కోసం, లెక్కలైతే ఏ నాటి నించో కడుతూ, ఆ 'వంద'వ యేడు వచ్చే దాకా ఆగి ఆగి, భారత కమ్యూనిస్టు పార్టీలు ఇప్పుడు 2017లో, రష్యా విప్లవాన్ని వేనోళ్ళ కీర్తించడాలతో తమ పత్రికలన్నీ నింపేశాయి!

రష్యా శ్రామిక విప్లవంలో, దాని ఎర్ర జెండా అగ్ని కాంతులతో ధగ ధగ లాడిందనీ, ఆ జెండా మహోత్సాహంతో ఆకాశంలో రెప రెప లాడిందనీ, అది నలు దిశలకూ కాంతులీనిందనీ, ఇంకా ఇదనీ - అదనీ, భారత కమ్యూనిస్టు పత్రికలు తమ భాషా చాతుర్యం కొద్దీ, తమ కీర్తనల శక్తి యుక్తుల కొద్దీ, తమ విప్లవ వాగాడంబరాల కొద్దీ, రష్యా ఎర్ర జెండాకి, అది మొయ్యలేనన్ని కీర్తి కిరీటాలు తొడిగేశాయి! పొగడ్తలనే తమ బాధ్యతగా భావించిన భారత పార్టీలు, తమ వ్యాస పరంపరల్ని పొగడ్తలతో మహోత్సాహంగా ముంచెత్తాయి.

అయితే, ఆ కీర్తనల వ్యాస పరంపరల్లో, ఏ సందులోనూ, 'రష్యన్ కమ్యూనిస్టు పార్టీ రద్దు' గురించి మాత్రం ఒక్క ముక్క అయినా లేదు. విప్లవ ప్రారంభాన్ని కీర్తనలతో ముంచెత్తిన వాళ్ళకి, 'దాని రద్దు' గురించి కూడా ప్రజలకు తెలియజెప్పవలిసిన అవసరం లేదా? చరిత్ర ఘటనల గురించి మౌనాలు వహించడమేనా?

ఆ సోవియట్ కమ్యూనిస్టు పార్టీ ఎందుకు రద్దయి పోయింది? ఆ ఎర్ర జెండా నిగ నిగలూ, ధగ ధగలూ, ఎందుకు అంతరించి పోయాయి? ఆ జెండాలో చలించిన రెప రెపలు, ఎందుకు నిశ్చలమై పోయాయి? ఆ పార్టీకీ, ఆ జెండాకీ, అంతంత ఘోరావమానాలు ఎందుకు జరిగాయి? ఆ పార్టీయే ఏవైనా ఘోర నేరాలు చేసిందా? అది, తన నేరాలకే తను బలై పోయిందా? - ఈ రకం ప్రశ్నలేవీ భారత వ్యాసాల్లో ఎక్కడా లేవు! పార్టీ రద్దు మాట అసలే లేదు!

జరిగిన సమాచారాలన్నిటినీ వ్యాసాల్లో ఇవ్వడం ఎవ్వరికీ సాధ్యం కాదు గానీ, ఆ రష్యా పార్టీ స్తితి గతుల గురించి, కనీసం రద్దు సంగతి గురించైనా, ఒక్క ముక్క తెలుస్తుందేమోనని, '100 యేళ్ళ' కీర్తనల వ్యాసాలన్నీ శ్రద్ధగా చూశాను. కానీ, ఏమీ లేదు. ఎక్కడా ఏమీ లేదు. ఏమీ దొరకలేదు.

రష్యా దేశంలో కమ్యూనిస్టు పార్టీ పాలనే సాగుతూ వుంటే, ఆ పార్టీని రద్దు చేసింది ఎవరు? ఆ పార్టీకే ఆ పాలన కష్టం అయిందా? ఆ పార్టీ, తనని తనే రద్దు చేసుకుందా? - అటువంటి

# 9. వెనక్కి, తాతమ్మ కన్నా వెనక్కి పోతున్నాం!

బిచ్చగాడు మన గుమ్మం ముందు నిలబడ్డప్పుడు అతడు అడగకపోయినా అతడి జోలెలో బిచ్చం పడితే చాలా సంతోషిస్తాడు. బిచ్చమే అతడి బతుకుదెరువు మరి!

తెలంగాణ ఆడవాళ్ళు 'చీరల దానాల' కోసం ఎదురుచూసే యాచకులా? కారు కదా? ఒక ఆడమనిషికి 'చీర దానం' ఎంత అవమానం?

అసలు, ఆడవాళ్ళు ఒక చీర కొనాలంటే బట్టల కొట్లో పది చీరలు తిరగా బోర్లా వేసి, చూసి, తనకు నచ్చిన రంగు, అంచు వున్న చీరే కొనుక్కుంటారు. ఎంత పేదరాలైనా నచ్చిన చీరే కొంటుంది గానీ, నచ్చని చీర కొనదు. ఒకరు ఇచ్చినా నచ్చని చీర కట్టదు. అటువంటి ఆడమనిషికి చీరని ఎవరో మగాళ్ళు నిర్ణయిస్తే, ఆడవాళ్ళే నిర్ణయించినా 'దానం'గా వచ్చే చీర నచ్చుతుందా? నచ్చినా నచ్చకపోయినా 'దానం చీర' ని అందుకుని కట్టిందంటే ఆ ఆడమనిషి ఉత్త అమాయకురాలు గాక ఎటువంటి మనిషి అవుతుంది?

కాస్త చీమూ నెత్తురూ ఉన్న ఆడమనిషైతే చీరని బహుమతిగా అందుకుంటుంది గానీ 'దానం'గా అందుకుంటుందా?

ప్రభుత్వం వారు బహుమతులే ఇస్తున్నారా? ఇచ్చేవి బహుమతులే అయితే వాటిని ప్రతి ఆడమనిషికీ ఇవ్వాలి. అప్పుడు తెల్లకార్డుల షరతులెందుకు?

తెలంగాణా అమ్మలారా! తెల్ల కార్డులు ఉన్నంత మాత్రాన మీరు యాచకులా? ప్రభుత్వం అనేది మీకు చీరలు ఇస్తోందంటే అది మీకు బంధువు అనుకుంటున్నారా? చీర దానం మీ కుటుంబంలో బట్టల కొరతని తీర్చేస్తుంది అనుకుంటున్నారా? చీరని దానంగా అందుకోవడానికి మీ పేదరికపు తెల్లకార్డు పరిస్థితి వల్ల మీకు బాధ కలగడంలేదా?

అసలు, మిమ్మల్ని పాలించే ప్రభుత్వాన్ని మీరేం అడగాలి? "మాకు కావలిసింది మా బతుకుదెరువు చీరని 'దానం'గా తీసుకునేటంత పేదరికంలో మేము వున్నామంటే, మాకు కావలిసింది ఈ గుడ్డముక్క కాదు. నెలకి ఇంత జీతం పేరుతో రెండు పూటలా తిండి తినేటంత బతుకుదెరువు కావాలి. నా జీతం నా చాకిరీకి తగ్గంతగా రాకపోయినా ఎంతో కొంత కల్పించండి. నా ఆదాయంతో నేను మొదట నా పిల్లలకి గుడ్డలు కొంటాను. తర్వాత, నా కోసం కొత్త చీర కొనగలిగే దాకా చిరిగి పీలికలైన గుడ్డలతోనే గడుపుకుంటాను. ఒక్క చీర దానం నా కుటుంబాన్ని ఉద్ధరించదు. నా పిల్లలూ, నా మొగాడూ, నేనూ అందరం మీరు దానం చేసిన చీరనే చుట్టబెట్టుకుంటామా?

అయ్యలారా! మేము రోజంతా ఒళ్ళు వొంచి చాకిరీలు చేసే వాళ్ళమేగానీ అడుక్కునే వాళ్ళం కాము. మాకు 'జీతాల' బతుకుదెరువులు కావాలి గానీ దానధర్మాలు కాదు. అవి వొద్దు. మమ్మల్ని మీ బిచ్చాలతో మాయబుచ్చబోకండి. మీ మీద మీ జాలీ, దయా కుండపోతలుగా కురుస్తూ వుండే చీరముక్కలు కాదు, ఆ డబ్బే ఇచ్చి చూడండి. దానితో రెండు రోజులు కడుపు నిండా తినగలమేమో.

మీ బతకమ్మ దానాల వల్ల పది మంది ఆడవాళ్ళందరి ఒంటిమీదా, బతకమ్మ వేషమేనా? కూలి పనులు మాని అప్పుడప్పుడూ బడికి పోయే మా పిల్లలు మా చీరల్ని బతకమ్మ యూనిఫారం అంటున్నారు. మేము సిగ్గులతో చావవలిసిందే. మా ఇష్టాయిష్టాలు మీకెలా అర్ధమౌతాయి? నేను కట్టవలిసిన చీరని నేను గాక నువ్వు ఎన్నిక చేస్తావా?

తెలంగాణా అమ్మలాలా! నోరు తెరిచి అడగలేరా మీరు? ఒక చీర గుడ్డ కోసం యాచకులుగా మారతారా? బిచ్చాలూ, దానాలూ, తీసుకుంటారా?

ఈ ఊళ్ళోనే పదహారేళ్ళ తెలంగాణ అమ్మా

యిని అడిగాను. "బతకమ్మ అంటే ఏమిటో మీకు తెలిసే ఉంటుందేమో చెప్పు కొంచెం" అని. ఆ అమ్మాయి ఎంతో మెతక పిల్ల. అయినా కోపం తెచ్చుకుంది. నాకు తెలిసి ఉంటుందని ఎందుకు అనుకుంటున్నావక్కా? మా తాతమ్మకి కూడా తెల్వదు. మా తాతమ్మ ఏమంటదో తెలుసా? "పోతున్నాం, వెనక్కి పోతున్నాం, మా తాతమ్మ కన్నా వెనక్కి పోతున్నాం" అంది.

ఆ అమ్మాయి ఏం అంటోందో నాకు అర్థం కాలేదు. "బతకమ్మ పూలదండలతో చెరువులన్నీ పవిత్రం అవుతాయట కదా?" అన్నాను.

ఆ అమ్మాయికి కోపం పెరిగింది. ఆ అమ్మాయి పేరు సరిత. ఏమిటక్కా! పవిత్రం? మొన్నటిదాకా వినాయకుడి బొమ్మలు పారేసి చెరువులన్నీ బురదమయం చేసేశారు. ఇప్పుడు మళ్ళీ బతకమ్మలు, పుష్కరాలు, దసరాలు, రేపు బోనాలు. మా తాతమ్మకే నచ్చడంలేదు. నీళ్ళ మడుగులన్నీ మురికై పోతాయని గోల పెడ తాంది. "అయ్యో, ఎంత వెనక్కి పోతున్నాం" అంటోందక్కా!

అయితే, నువ్వు బతకమ్మ చీర తీసుకోవా?

నేనా? దాన్ని నేను ముడతానా? మా అమ్మ కూడా ముట్టదు. తాతమ్మ అసలే పట్టుకోదు. అయినా మతి లేని వాళ్ళు లేరా అక్కా! ఒక్క చీర కోసం ఏటా ఎదురుచూస్తూ వుంటారు. పోతు న్నారు, పోతున్నారు, వెనక్కి, వెనక్కి.

నేను నవ్వాను. జనం వెనక్కి పోతేనే కదా, నోరు విప్పకపోతేనే కదా ప్రభుత్వం ముందుకు పోయేది? అది తెలుసా? అంటే, సరిత తెల్ల బోయింది కొంచెం సేపు. అవునవును, ప్రజలు దగా అయిపోతున్నారు అంది ఆశ్చర్యపోతూ ఏదో తెలిసినట్టు.

[ 'నవ తెలంగాణ' నవంబరు, 2017 ] *

# 10. ఇవి గారడీ ప్రదర్శనలు!

ప్రపంచ తెలుగు మహాసభల మీద నా అభిప్రాయం అడిగారు కదా? దోపిడీ ప్రభుత్వాలు చేసే ఏ గారడీల మీదైనా నా అభిప్రాయం ఏం ఉంటుంది? రోజూ పేపర్ తెరిస్తే ఈనాటికీ రైతుల ఆత్మహత్యలే, ఆడపిల్లల మీద అత్యా చారాలే! తెలుగు సభలంటే ఏ ఘోరాలు ఆగు తాయి? వాటిని ఆపే దృష్టి లేని ప్రభుత్వానికి తెలుగు మీద దృష్టా? 'తెలుగు' అంటే, కవులే, రచయితలే, కళాకారులే గానీ, రైతులు కనపడరా? నిరుద్యోగులు కనపడరా? ఆదివాసులు కన పడరా? స్కూళ్ళ నిండా ఇంగ్లీష్ మీడియాలను అలాగే సాగనిస్తూ ఉంటే, తెలుగు సభల వల్ల, విద్యార్థులకేం ఒరుగుతుంది?

నిన్న, 'ఇవాంకమ్మ' కోసం కోట్లు విరజిమ్మితే ప్రజలకేం ఒరిగింది? ఈ సభల వల్ల, తెలుగు దురహంకారాలూ, బతకమ్మా - బోనాల మూఢ సంస్కృతులూ, పెచ్చు పెరగడమే కదా? దోపిడీ ప్రభుత్వానికి ఇప్పటికే వందిమాగధులుగా ఉన్న కలం యోధులకు, ఇంకా మరి కొందరు చేరి, పాలక వర్గ కలాల సైన్యం పెరగడమే కదా జరిగేది? దోపిడీ వర్గాలు, ఒక వైపు, పోలీసు దండోపాయాలతో ప్రజల్ని అణచడానికి చూస్తూనే, ప్రజల్ని ఈ రకం గారడీల్లోకి లాగి, వారి భావ జాలాన్ని, ఇదిగో, ఇలాగే వంకర టింకర్లు చేస్తూ ఉంటారు. దోపిడీ వర్గానికి ఇదో మార్గం!

[ 'నవ తెలంగాణ' 13-12-2017 ] *

# 14. ఆ సినిమా ముగింపు ఇలా వుండి వుంటే?

పాత సినిమా మాట ఇప్పుడా? అవును మరి, ఇప్పుడే! ఆ పాత "వసంత కోకిల" సినిమాని నేను చూసింది ఇప్పుడే మరి! నాలుగైదేళ్ళ కిందట అనుకుంటా, దీని కన్నా పాత "స్వర్గసీమ"ని చూసి, దాని మీద రాయలేదా? పాతా, కొత్తా, అని కాదు; ఎప్పుడు చూస్తే అప్పుడే మాట్లాడుకోవచ్చు!

శ్రీదేవి మరణం మీద, అది హత్యా, ఆత్మ హత్యా, సహజ మరణమా - అనే చర్చలు సాగుతూ వుంటే, ఆమె సినిమా ఒక్కటి కూడా చూడని నాకు, ఆమె సినిమా ఏదైనా చూడాలనిపించి, కొందర్ని అడిగితే, "వసంత కోకిల" అనీ, "పదహారేళ్ళ వయసు" అనీ, ఇంకా ఏవో చెప్పారు. "పదహారేళ్ళ" సినిమా చక్కగా లేక పోయినా, అందులో కథ చాలా మంచిది. ఈ కథ, ఎవ్వరికైనా, 'అత్యాశ'ని పోగొట్టే వివేకం ఇస్తుంది. సినిమాల్లో ఇటువంటి కథలు చాలా అరుదు.

నిన్న మొన్న చూసిన "వసంత కోకిల" అయితే, చాలా నచ్చినదీ, చాలా నచ్చనిదీ, అయింది నాకు! ఈ కథలో, కథా నాయకుడైన శ్రీనివాస్ పాత్ర, మంచిది. కథా నాయకి అయిన విజయ, ఈ కథని బట్టి, 'కీలుబొమ్మ' రకం మాత్రమే! కానీ, ఆ పాత్ర నటనే ప్రత్యేకం!

ఈ సినిమా, బాగా నచ్చే, నచ్చనీ, రెండు లక్షణాలు కలది కాబట్టే, దీని మీద రాయాలనిపించింది.

ఆడ పిల్లల్ని మోసాలు చేసి, వ్యభిచార గృహాలకు అమ్మివేసే నీచత్వాలు సమాజంలో నిత్యం జరుగుతూ వున్నవే. అంతే కాదు; రోజూ యాక్సిడెంట్లూ, వాటి వల్ల రక రకాల జబ్బులూ కూడా, చుట్టుకుంటూ వుంటున్నవే. ఈ కథలో, 'కల్పన' ఎంత వున్నా, 'సహజత్వం' కొంతైనా వుంది. అందుకే, దీన్ని గురించి చెప్పుకోవచ్చు.

సినిమా ప్రారంభంలో అయితే, హీరోయిన్ డ్రస్సూ, ఆ పాటా, ఆ గంతుల గుంపూ, అవన్నీ రోత రోతే! "ఈ చీదరని ఇంకేం చూస్తాం?" అని వెంటనే అనిపించింది గానీ, అంతలోనే ఆ గుంపు ఎక్కిన కారుకి యాక్సిడెంటూ, ఆ షాక్‌తో హీరోయిన్‌కి మతి పోవడం, ఆ మనిషికి ఆరేళ్ళ నాటి గుర్తులు మాత్రమే మిగిలాయని డాక్టర్ చెప్పడం, అదంతా క్షణాల్లో జరిగిపోతే, "ఇదేంటో కాస్సేపు చూద్దాంలే" అనిపించి, అది కొంచెం నిదానించేలా చేసింది.

ఈ కథలో హీరో, అవివాహితుడు. తాగుడూ, తిరుగుడూ లేని ఉత్తముడు. అతని స్నేహితుడు పరమ చెత్తగాడు! అంత చెత్తగాడితో, మంచి వాడు స్నేహంతో వుండబట్టే, మంచి వాడు కూడా కొంత చెత్త మాటల్లో పడ్డాడు. చెత్త గాడెప్పుడూ, మంచివాణ్ణి కూడా తన లాగే మార్చాలని చూస్తాడు. "పెళ్ళికి ముందే మొగవాడికి ఆడ వాళ్ళతో అనుభవాలు వుండాలి" అని చెత్తవాడి వాగుడు! అప్పుడు, మన ఉత్తముడు, "పెళ్ళికి ముందు, ఆడవాళ్ళకి కూడా నువ్వు చెప్పే అనుభవాలే వుండొద్దా?" అని, ఆ చెత్త వెధవని అడగడు. ఒకవేళ, ఆ మాట అడిగినా, చెత్తగాడు ఏమంటాడంటే, "అది ఆడవాళ్ళకి అక్కరలేదు, మొగాళ్ళకే కావాలి, అసలు నైపుణ్యం అంతా మొగ వాడిదే కదా?" అంటాడనుకోండీ!

మన కథానాయకుణ్ణి, "చాలా ఉత్తముడు" అని మళ్ళీ చెప్పాలంటే నాకు భయం వేసే విధంగా, మన ఉత్తముడు, తన చెత్త స్నేహితుడితో కలిసి, ఒక వ్యభిచార గృహానికి బైల్దేరాడు! అక్కడ వుండే ఆడపిల్లలు భోరున ఏడుస్తూ వుంటారనీ, ఆ దీనుల్ని కేవలం చూసి రావాలనే 'జాలి'తో వెళ్ళడం కాదు అది. అక్కడేదో ఆనందం దొరుకుతుందనే వెళ్ళాడు, మన ఉత్తముడు కూడా!

అక్కడ చూశాడు, ఆరేళ్ళ పిల్ల మతితో వున్న దాదాపు ఇరవై ఏళ్ళ హీరోయిన్‌ని. ఆ పేషెంటు ఆస్పత్రిలో వున్నప్పుడు, ఎవడో ఒక మోసగాడు, "మీ అమ్మని చూపిస్తాను, రా" అని మతి లేని ఆమెని మోసంగా తెచ్చి ఒక వ్యభిచార గృహానికి అమ్మేశాడని కథనం! ఆస్పత్రిలో, మతి లేని పిల్ల

**End of Preview.**

**Rest of the book can be read @**

http://kinige.com/book/Premaki+Mugimpu+Eppudu

* * *